క్లుప్తంగా

ఎన్‌సీటీఈ నిబంధనలు తప్పక పాటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ల పోస్టుల విషయంలో ఎన్‌సీటీఈ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ కరణం హరిక్రిష్ణ, జనరల్ సెక్రటరీ అంకాల కొండయ్య కోరారు. ఆదివారం జూమ్‌ద్వారా రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఎన్‌సీటీఈ నిబంధనలకు వ్యతిరేకమన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోందన్నారు. కనుక కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్లస్ టు పాఠశాలల్లో 11, 12 తరగతులకు బోధించే వారికి జూనియర్ లెక్చరర్లతో సమానంగా వేతనాన్ని ఇస్తూ గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ సురేష్, సంయుక్త కార్యదర్శులు ధనుంజయరావు, పెదన్న, బందభాన్ డోలై, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



నగరంలో 5కె రన్ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : క్రీడలతోనే ప్రజలకు మానసిక ఉల్లాసం కలుగుతుందని కడప డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నగరంలో పోస్టల్ సిబ్బంది 5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా ప్రజలకు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం వేళల్లో వ్యాయామం తప్పని సరిగా చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ గణేష్, గోపాల కృష్ణ, రవికాంత్, రహమతుల్లా ఖాన్ పీఎల్‌ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల ఆట-పాట



శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై స్థానిక నరసింహా డ్యాన్స్ అకాడమి విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పలు ప్రాచుర్యం పొందిన సినీ గీతాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

తప్పుడు ఆరోపణలు తగదు

కడప రూరల్ : పద్మశాలీయ సేవా సంఘంపై కొంత మంది తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్మశాలీయుల సంక్షేమం కోసం 1998లో పద్మశాలీయ సేవా సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఈ సంఘంలో 208 మంది సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. విరాళాల ద్వారా సేకరించిన నిధులతో కడప నగరంలో 30 సెంట్ల స్థలం కొనుగోలు చేసి అందులో ఒక కళ్యాణ మండపం నిర్మించామన్నారు. ఈ కళ్యాణ మండపం ద్వారా వచ్చే డబ్బును పద్మశాలీయుల వర్గానికి చెందిన ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు, సంఘం వార్షికోత్సవాలు, వన భోజనాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అయితే కొంతమంది సంఘాన్ని అప్రతిష్టపాలు చేసేలా తప్పుడు ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. వారి సందేహాలను నివృత్తి చేయడం కోసం సెప్టెంబర్ 24వ తేదీన నిర్వహించే సంఘం సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జానపాటి బాలయానాదయ్య, ఉపాధ్యక్షులు ఎస్‌సీ వెంకటసుబ్బయ్య, గోపి పాల్గొన్నారు.

వాసవీమాతకు ముత్యాల పట్టుచీర

పోరుమామిళ్ల : పట్టణంలోని అమ్మవారిశాలలో కొలువై వాసవీ కన్యకాపరమేశ్వరీదేవికి ఆదివారం ముత్యాల పట్టుచీర అలంకరించారు. ఆర్యవైశ్య యువకులు మూడున్నర లక్షల రూపాయలతో ముత్యాల పట్టుచీర, గొడుగు, మకర తోరణాలు తయారు చేయించారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారి పట్టుచీరకు పూజలు చేయించి, మహిళలు విడిభాగాలను వెండి పళ్లాలలో పట్టుకుని, అంగరంగ వైభవంగా ఊరేగింపుగా అమ్మవారిశాలకు తీసుకెళ్లారు. ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు గాజులపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాత్రి అమ్మవారికి వేదమంత్రాలతో అర్చకులు అమ్మవారికి అలంకరించారు.

అట్టహాసంగా అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పలు చోట్ల కేక్ కటింగ్‌లు, సేవా కార్యక్రమాలు



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్ అవినాష్‌రెడ్డి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువకుడు

కడప కార్పొరేషన్ : కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అవినాష్‌రెడ్డి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఉన్న ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో హరూన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, ఎం. సుబ్బారెడ్డి, చెన్నయ్య, షఫీ, బాలస్వామిరెడ్డి, డాక్టర్ సొహైల్, సీహెచ్ వినోద్, కోలా కొండయ్య, పస్తం అంజి, మూలే సరస్వతి, టీపీ వెంకట సుబ్బమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో 187 మంది రక్తదానం

■ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్‌ఐ చర్చి ఆవరణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 187 మంది యువకులు, అభిమానులు రక్తదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి హఫీజుల్లా, కార్పొరేటర్ ఎస్‌ఏ షంషీర్, సుబ్బరాయుడు, అర్షద్‌ఖాన్, ఫవాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

■ సంధ్యా సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీమ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎంతోపాటు ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ఏపీఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డీఎల్‌డీఓ చైర్మన్ మాధవరెడ్డిలు హాజరయ్యారు. ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో రహీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహారం పంపిణీని 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ప్రారంభించారు. అనంతరం ఎంపీ ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహించారు.

■ వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి హఫీజుల్లా, పాకా సురేష్, వేణుగోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

■ వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీవుల్లా ఆధ్వర్యంలో నగర శివార్లలో ఉన్న చౌడేశ్వరమ్మ వృద్ధాశ్రమంలో అల్పాహారం, శంకరాపురంలోని అంధుల పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

■ వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్ ఆధ్వర్యంలో స్థానిక నూర్జహాన్ కళ్యాణ మండపంలో భారీ కేక్ కట్ చేసి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి, యూఏఈ కన్వీనర్ సయ్యద్ అక్రం, రహమతుల్లా, ఎంవీ నరసారెడ్డి, ఎస్. మహేష్‌రెడ్డి, పి. సురేష్‌రెడ్డి ఎన్‌ఆర్‌ఐలు బాబుబాయ్, గయాజ్ ఉస్మాన్ పాల్గొన్నారు.

■ జిల్లా పరిషత్ ఆవరణంలోని ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మున్నా ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి, అన్నదానం చేశారు.

■ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ కుమార్, 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో నవజీవన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం రాజీవ్ పార్కు వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

నిరుపేదలకు లక్ష రూపాయల వితరణ



నిరుపేదలకు నగదు విరాళంగా ఇస్తున్న కో ఆప్షన్ సభ్యుడు జహీర్

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎండీ జహీర్ ఆధ్వర్యంలో నిరుపేదలకు లక్ష రూపాయల నగదును వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై నగదును పేదలకు అందించారు.

■ సీఎస్‌ఐ మైదానంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచం రెడ్డి సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున, షంషీర్, నాయకులు బండి ప్రసాద్, శ్యాంసన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



నవజీవన్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు షఫీవుల్లా

■ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా హరూన్ గ్రూప్ ఎండీ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఇందిరానగర్ పద్మావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏడు రోడ్ల కూడలిలో పవర్ అల్తాఫ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా అధికారులు



గ్రూప్-1 టాపర్లను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కల్చరల్ : ప్రభుత్వ అధికారులు ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సరిగా అందేలా చూసే బాధ్యతను తీసుకోవాలని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. స్థానిక ప్రముఖులు చౌడం సూరిబాబు ఆధ్వర్యంలో గ్రూప్-1లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన వంకం సాయి హర్షిత, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికైన మేరువ చందులతోపాటు పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌ను సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సత్కార సభలో ఉపముఖ్యమంత్రి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చినపుడే చదువుకు, అధికారానికి సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు. పిల్లలు ఉన్నత స్థానాలకు చేరుకున్నారంటే తల్లిదండ్రుల పాత్ర అమోఘమైనదన్నారు. ఇష్టపడి, కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని, వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సత్కార గ్రహీతలు వంకం సాయి హర్షిత, మేరువ చందు మాట్లాడుతూ తాము ఈ స్థాయికి చేరుకునేందుకు తల్లిదండ్రులు, గురువులు, మిత్రుల సహకారం వల్లే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం. బాలకృష్ణ యాదవ్, డాక్టర్ ప్రత్యూష పట్టెం, నీటిపారుదల శాఖ ఇంజినీరు రామమునెయ్య, కార్పొరేటర్ మోతుకూరు సుజాత, తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, ప్రముఖులు ఈడెం లక్ష్మీనారాయణ, పాలెం రాజగోపాల్, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఉమ్మడిశెట్టి జనార్దన్ బాబు , చౌడం నాగార్జున, చౌడం వెంకటనారాయణ ,పల్లా వెంకటేశ్వర్లు , ఉమ్మడిశెట్టి దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేటి సాహిత్య కార్యక్రమాలు

కడప కల్చరల్ : కడప నగరంలో సోమవారం సీపీ బ్రౌన్ ఊహా చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రమణ్యం 101వ జయంతి వేడుకలను ఉదయం 9.30 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ ఉప కులపతి, కుల సచివులు, బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరు కానున్నారు.

■ వ్యావహారిక భాషోద్యమ పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 161వ జయంతి, తెలుగు భాషా వికాస దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు తెలుగుభాషా వైభవం పేరిట ప్రత్యేకకార్యక్రమం నిర్వహించనున్నారు. నగరానికి చెందిన ప్రభుత్వ బాలికల కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ పి.నీలవేణి ఈ కార్యక్రమంలో వక్తగా పాల్గొంటారు.

■ కడప నగరం పాత కలెక్టరేట్ వద్దగల ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఉదయం 10.00 గంటలకు ఆంధ్రప్రదేశ్ తెలుగుభాషా వికాస ఉద్యమం, మహాకవయిత్రి మొల్లమాంబ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో తెలుగుభాషాభివృద్ధి కోసం కృషి చేసిన నలుగురికి పురస్కారాలను ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వ చారి, డీకే చదువులబాబు, కుందారపు గురుమూర్తి, రేనాటి వెంకట సుబ్బయ్య, పాపిజెన్ని రామకృష్ణారెడ్డిలకు తెలుగు భాషారత్న పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు గత మూడు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే జీతాలను చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాళ్లపల్లి అబ్దుల్లా డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆదివారం జిల్లాశాఖ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను వెంటనే రద్దు చేసి ఓపీఎస్ మాత్రమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శివరామకృష్ణారెడ్డి, కమాల్‌బాషా, నరసింహులు, సిద్దయ్య, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మురికికూపంలా ఏఆర్‌పీ కాలనీ





రోడ్లపై నిలబడిన మురికి నీరు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం ప్రకాశ్‌నగర్ ఏఆర్‌పీ కాలనీ రోడ్డు మురికి కూపాన్ని తలపిస్తోంది. అక్కడి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న రహదారిపై మురికి నీరు నిల్వ ఉండడంతో ఆ ప్రాంతంలో తిరగాడే విద్యార్థులు, స్నేహాలయ వృద్ధాశ్రమంలోని వృద్ధులు, ప్రజలు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఒకప్పుడు రహదారి బాగానే ఉండేది. రెండేళ్ల క్రితం రహదారి మట్టి తవ్వి ఇంకొకరి ఇంటి ముందు వేశారు. ఆ ఇంటిలోకి నీరు రాకుండా అలా ఎత్తు పెంచారు. అయితే రహదారిపై కొత్తగా మట్టిపోసి లెవల్ చేయలేదు. మట్టి తొలగింపు కారణంగా రహదారిపై గుంత ఏర్పడింది. వర్షాకాలంలో నీరంతా వచ్చి అక్కడ నిల్వ ఉంటోంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఇళ్లల్లోని మురికి నీరు కూడా రహదారిపై ప్రవహిస్తూ అక్కడ చేరుతోంది. దీంతో ఆ ప్రాంతం మురికి గుంతగా మారింది.

ఆ దారిపై వెళ్లేవారికి తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. నిన్నటివరకు అక్కడి మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. రహదారిపై నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధిచెంది జ్వరాల బారిన పడాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మట్టితో రహదారిని లెవెల్ చేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సదా రుణపడి ఉంటా

- టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమ బాబు
- వెల్లువెత్తిన అభినందనలు, మోచంపేటలో భారీ ర్యాలీ



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం, మాసీమ బాబు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి తిరుమల, తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మాసీమ బాబు అన్నారు. టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి కడప నగరానికి విచ్చేసిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలతో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. మోచంపేటలో మాసీమ బాబు స్వగృహం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి మాసీమ సర్కిల్‌లో దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై మాసీమ బాబుకు శాలువా కప్పి, పూలమాల వేసి, కిరీటం ధరింపజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, సానపురెడ్డి శివకోటిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, ఎం. సుబ్బారెడ్డి, షంషీర్, చంద్రహాసరెడ్డి, పార్టీ నాయకులు నాగేంద్రారెడ్డి, ఆర్‌వీ రమణ, కె. రాజశేఖర్‌రెడ్డి, కమాల్‌బాషా, బండి ప్రసాద్, సంపత్, టీపీ వెంకట సుబ్బమ్మ, నారాయణమ్మ, చైతల్య తదితరులు పాల్గొన్నారు.

■ వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మున్నా ఆధ్వర్యంలో భారీ గజమాలతో మాసీమ బాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. 40వ డివిజన్ కార్పొరేటర్ ఎం. బాలస్వామిరెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకుడు పస్తం అంజి ఆధ్వర్యంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యాదవ అన్నసత్రం అధ్యక్షుడిగా పెరుగు కృష్ణయ్య



బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో ఉన్న యాదవ సమాజం అన్న సత్రం నూతన అధ్యక్షుడిగా పెరుగు కృష్ణయ్య యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సత్రంలోని కల్యాణ మండపంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామయ్య హాజరయ్యారు. మైదుకూరుకు చెందిన పెరుగు కష్ణయ్యయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవ అన్నసత్రాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సుగుణాల పట్ల ప్రేరణ కల్పించేందుకే పర్వదినాలు



మాట్లాడుతున్న ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ ఇన్‌చార్జి రాజయోగిని బీకే లీలాదీది

కడప కల్చరల్ : సుగుణాల పట్ల మనిషికి ప్రేరణ కల్పించేందుకే పర్వదినాలు ఉన్నాయని బ్రహ్మకుమారీ అక్కయ్యలు అన్నారు. ఆదివారం స్థానిక ఓం శాంతినగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం కార్యాలయంలో రక్షాబంధన్, శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ ఇన్‌చార్జి రాజయోగిని బీకే లీలా దీది ఇతర అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుని మనసుకు జ్ఞానం, శాంతి, ప్రేమ, సంతోషం, శక్తి కావాల్సి ఉందని, మానవతా విలువల ద్వారా వాటిని సాధించుకోవచ్చని తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌చార్జి, జిల్లా కో ఆర్డినేటర్ రాజయోగిని బీకే గీతా దీది రక్షాబంధన్ వెనుకగల ఆధ్యాత్మిక రహస్యాన్ని వివరించారు. కార్యక్రమానికి ఆర్టీసీ డీపీటీఓ గోపాల్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే పీడబ్ల్యూఐ వెంకటేశ్వరరావు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ఆధ్యాత్మిక గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంస్థకు చెందిన పలు సేవా కేంద్రాల నుంచి 25 మంది బ్రహ్మకుమారీ ఉపాధ్యాయులు, 200 మందికి పైగా బ్రహ్మకుమారీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆహ్లాదం..ఆనందం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని 45వ డివిజన్ ఊటుకూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ పార్కు ప్రజలకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని అందిస్తోంది. ఇక్కడి వ్యాయామ పరికరాలు, మ్యూజికల్ సిస్టం, సేద తీరేందుకు ఏర్పాటు చేసిన బల్లలు సందర్శకులకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ఉన్నాయి. పార్క్ మధ్యలో ఏర్పాటు చేసి వాటర్ ఫౌంటెన్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది.



పచ్చదనంతో కళకళలాడుతున్న పార్కు



సందర్శకులకు కనువిందు చేస్తున్న వాటర్ ఫౌంటేన్



పార్కులో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆటల పరికరాలు

పాఠశాల విద్యను ప్రాంతీయ భాషలోనే బోధించాలి

గోపవరం : ప్రాథమిక స్థాయిలో పాఠశాల విద్యను ప్రాంతీయ భాషలోనే బోధించేలా చర్యలు చేపట్టాలని తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగువెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విద్యా వ్యవస్థలో ఆంగ్లభాష ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ ఐక్యరాజ్య సమితి వరకు అంతర్జాతీయ సంస్థలు ప్రాథమిక స్థాయి (5వ తరగతి) వరకు మాతృభాష మాధ్యమంలోనే విద్యాబోధన జరగాలని చెబుతున్నాయన్నారు.